కాంపులో షాంపూయింగు

కథ కల్పించి వ్రాదామనే కూర్చుంటాను. కాని, ఒక్కొక్కప్పుడు ఆ కల్పనకు పూర్వజన్మ వాసనగా నిజం కళ్ళకు కట్టినట్లు ముందు తాండవిస్తూ అదే కథగా తోస్తుంది. అటువంటి అనుభవం ఒకటి ఈ నాడు పాఠకులకు పరిచయం గావింపబోతూ వున్నాను- ఎవళ్ళుగాని, వారు తెల్లవారైనా నల్లవారైనా తమమీద బెట్టుకోబోకండి !

నే నెక్కిన రైలుపెట్టెలో పూర్వం ఎప్పుడూ తెల్లదొరలు గాని, తెల్లదొరసానులుగాని కనిపించేవారుకారు. అసలు వాళ్ళు ఈనాటి రెండవ తరగతి-అనగా వెనుకటి ఇంటర్ బండి ఎక్కే వాళ్లేకారు. వాళ్లు ఆలా ఆ రోజుల్లో అసలైన మొదటి తరగతి బోగీలో ప్రయాణం చేస్తూవున్నా, "డిన్నర్ కారు"లో మెఱిసి పొయ్యే ఫోర్కులతో తింటూవున్నా, "మనకు వీళ్లు అందుబాటులోకి ఎన్నటికీ రాబోరు ; మనం మనమే, వీళ్ళు వీళ్ళే-తూర్పు తూర్పే-పడమర పడమరే-" అని ఎవరో వ్రాసినట్టు అనుకునే వాణ్ణి. పూర్వం అంటే బి. సి. లో అని అనుకునేరు గనుక ; కాదు—"Quit India" సంఘటనకు క్రితం అంటే మూడేళ్ళ వెనుకటివఱకూ అన్నమాట.

మరి ఈ దరిమిలాను దొరలంటే కబురూ లేదు, కాకర కాయా లేదు. వాళ్ళు కనిపించడమే మానేసేసారు. "భారత్"లో లేనేలేరేమో కూడాను వారు అనే సంశయంలో పడేటంత అరుదై పోయారు. ఏదైనా లేని సరుకును కాంక్షించ బుద్ధి, చక్కదన

మంతా వారితోనే పోయినట్టు, సౌరు అంతా వారితోనే సమసి పోయినట్టు, సిరి, సంపత్తు, చేవ, తేవ సమస్తం వారితోనే హరించిపోయినట్టు అనిపించింది ఒకనాడీమధ్య రైలు ఎక్కుతూంటే.

చెక్కాల పెట్టెలో కూర్చొని అలా పైకీ చూచాను. "అప్పర్ బెర్తు" మీద ఆ "నైన్ డౌన్" లో ఏణాక్షి ఒక దొరసాని కానవచ్చింది. ఇంద్రధనుసు రంగుల పట్టురుమాలొకటి తలకు టోపీలా పిన్నులుపెట్టి లోపల పుల్లలమీద నిలిపి చుట్ట బెట్టుకుంది. పొట్టిగౌను మీగాళ్ళదాకా మాత్రమే వచ్చేది తొడి గింది. డోరియాలది. బోడిస్ బోడిస్‌మీద జాకెట్టు ఏదాకా దిసగా వుంటే బాగుంటుందో ఆదాకా తొడుక్కున్నదై ఆ బాహామూల హస్తాంగుళీ పర్యంతం నున్నందనమే చూపసాగింది. మడమ లెత్తు జోళ్లు విడువనిదై మేజోళ్లు ఒంటినంటుకుపోయి రంగు రంగు ఒకటా అన్నట్టు గోచరింపచేస్తూవుంటే వదలినదై కను పాపల్లో నీలాకాశం, చెక్కిళ్ళమీద సంధ్యారాగం కాపురుస్తూ అపర అప్సరస గుళికలా గోచరించింది.

వెంటనే స్ఫురణకు వచ్చింది, పశ్చిమార్ధగోళం వెళ్లిన యువకుడొకడు "The lassie I loved here is wonderful" అని తన ప్రియురాలినిగురించి వ్రాసిన ముక్క. ఏదో రహస్యమని ఇంగ్లీషులో వ్రాశాడతగాడు. తెనుగున చెబితే ఏమీలేదు అందులో "నేను ఇక్కడ ప్రేమించిన పిల్ల అపురూపపు పిల్ల" అని దాని అర్థము. తాను ప్రేమించిన పిల్ల అపురూపంగా వుండకపోతే ఏలా వుంటుందనో అతగాని అభిప్రాయం! అత డెఱుగడేమో "తా వలచినది రంభ, తా మునిగినది గంగ" అన్న సామెత.

వారి గొడవ మన కెందుకుగాని ఇక్కడ ఏ ప్రేమా నాలో రేకెత్తించకుండానే ఈమె బహూ అందంగా, సుందరంగా గోచరించింది. ఈమె ఇలా వున్నప్పుడు ఈమెను ఎదురుకాళ్ళ దన్నేవాళ్లు ఎల్లా వుండివుండాలో అనే వూహ ఆ ఘడియప్పుడు పట్టపగ్గాల్లేకుండా ప్రసారం గాదొడగింది సర్వసాధారణంగా.

ఇదంతా ఇంద్రియ నిగ్రహ నిబద్ధమైన అతి వాస్తవికత! ఇక కల్పనలోకి పోదాం! అదీ ఒకరు "నిజంగా జరిగింది సుమండీ!" అని చెప్పిన యదార్థపు సంగతే కాని నా నోట తిరిగీ పలకడంలో కలపన అయి ఈ దిగువ రూపంలో నిలిచి పోయింది:

"మనవాళ్ళకు, అంటే భారతీయులకు నీతి, జాతి నేర్పింది తెల్ల దొరలనుకోండి పంతులుగారూ! అసలు మనకంటె భయంకరస్వరూపులైన నీగ్రోలకు నీతి, జాతి నేర్పింది వీరే! కాని మనల్ని చూచి వాళ్ళే పాడయిపోయినారో, వాళ్ళనుచూచి మనమే పాడయిపోయినామో, ఇప్పుడు లోకం అంతా ఒక్కరకంగావుంది. మానహీనంగా, దీనంగా, న్యూనంగా, దిసదిస నగ్నంగా! "న్యూడ్ ప్రమాణంగా! వాళ్లూ మోకాళ్ళమీదకు లాగులే. మనవాళ్లూ మోకాళ్ళమీదకు లాగులే! వాళ్ళ ఆడవాళ్ళూ వొళ్ళంతా ఎదర చూపుకు వదిలేసేవాళ్ళే, మన ఆడవాళ్ళూ వొళ్ళంతా ఎదర చూపుకు వదిలేసేవారే! ఇదేం పాపమో! ఈ బహిరంగపుచ్చుట తమకు భంగపాటనీ తలపోయరు; మగాడిలో పౌరుషం అమ్మట్టునే జారిపోతుందనీ ఎంచరు—గమిలో గుమ్ వుండేదిగాని పంతులుగారూ గయాళలో ఏముండ గలదండీ!

“ కాని తెనుగువారి మగతనం. మర్యాదా అక్కడేవుంది. భారతీయు లందరిలోనూ మన తెనుగు జోదుల్లాంటి జోదుల్లేరను కొండి ! నే చెప్పే దిప్పటి మాటకాదు ఎప్పటి మాటోను ; ఎక్కడి మాటోను ! బోయర్ యుద్ధంనాటి మాట ; ఆఫ్రికా ఖండంలో సంగతి.

అంతంత పాములు ఆలా సర్పాలు ఎత్తిపెట్టుకొని చెట్లను వేలాడి పడగనెత్తి వంపులు, వంకరలు పోతూవుంటే, వాటి నీడను బోరలను పయటలు లేక, రయికలు లేక ఉంగరాలు తిరిగిన తమ జుత్తు నెగరేసుకుంటూ నీగ్రో పడుచులు, పిండని పాలిండ్లతో కనుబండువు గావిస్తూ వుండేవారట ! వారిని చూస్తూ తెల్ల సోల్జర్లు, ఇంగ్లండునుంచి వచ్చినవాళ్ళు మోహపడిపోయి ముచ్చెమట్లు గార్చేసేవారట. అది తెలిసి ఇక్కడి ప్రభుత్వం వారు తెనుగు సిపాయీలను, తెలగాలను తిన్నగా తుపాకీల సమేతంగా పంపించేరట. పంపించి “ చూడండి ! మీరు చిత్త చాంచల్యం లేనివారు. మా వారి బుద్ధి నీగ్రో పడుచులుని చూచి మారిపోతూవుంది. మరీ జారిపడిపోతూవుంది. ఆ స్త్రీల నేలా పయటవేసికునేలా, రయిక తొడుక్కునేలా “ చేస్తారో ! ” అని, “ ఫైర్ ! ” అని కమాండరు తెల్ల సేనాపతి పుత్తర్వు ఇచ్చాట్ట! వీళ్ళు అనగా తెనుగువారు ఆ యువతుల బోరలకు గుళ్లు జారెట్టి ఒకళ్ళిద్దర్ని పడగొట్టేరో వాళ్లు అర్థంచేసుకుని వెంటవెంటనే చేతులే చనుగప్పులుగా నప్పించుకొని క్రమంగా అవి తీసేసు కుని, ఆకులు నేసుకుని, తుదకు కోకలూ, కూర్పాసాలు దాల్ప సాగారుట ! అటువంటి నిర్మోహమాటం, నిర్మోహం గలవాళ్ళు ఆనాటి మన తెనుగువీరులు.

"క్రమంగా కత్తి విడిచిపెట్టి కలంపట్టినవాళ్లు కొందరు, డాలువిడిచి పెట్టి దవాలు వేసుకొన్నవాళ్లు కొందరు అయిపోయారు ఆంధ్రులు. తుద కీనాడో ఆంధ్రుడంటే అరవవానికీ లోకువే! ఆడదానికీ లోకువే!"—

"అయితే వొకటుంది పంతులుగారూ! ఆంధ్రునికి కళ యందున్న అభిమానం, కాంతియందున్న ఆమోదం మరెవరికీ లేదు. వాడు డఫేదారే కానియ్యండి. సిరస్తాదారుగానే పనిచేయ నియ్యండి. అందువల్లనే మనవాళ్ళు అంటే తెల్లదొరలకు ప్రీతి మెండు. అందం అంటే పడిచచ్చిపోతారు మనవాళ్లు. రసాస్వాదన మంటే ఉవ్విళ్లూరి పోతారు వీళ్లు. ఇంతెందుకు చెబ్తూవున్నానంటే. మా తండ్రిగారినోట నేను విన్నానుగనుక ఈ సంగతి—ఏ సంగతి అని అడగబోతారేమో—అదే మనవిచేస్తూ వున్నాను."

"మా తండ్రిగారికి కలెక్టరేటులో కాంపు క్లర్కు వుద్యోగం. మఱి కలెక్టరుగారు కాంపుకు వెళ్ళరా, కూడా వుండ వలసినదే ఈయనా, డఫేదారు ఇద్దరూ కూడా. ఆ రోజుల్లో కలెక్టర్లంటే గవర్నర్లనుకూడా చెలాయించే వారుట. సీమదొరను తప్పించి మఱొకర్ని ఆ పోస్టుకు నియమించేవారు కారట! కలెక్టరుగారి భార్య ఎప్పుడన్నా కాంపునకు భర్తతో బయలు దేరటంకూడా ఉండేదట. దేశంకాని దేశం ఉద్యోగ హోదాలో చూడాలని ప్రతివారికీ వుంటుంది. చూడండి!—ఆ కలెక్టరుగారి భార్య అసమాన రూపసియట! మా నాయనగారే చెప్పారంటే ఆమె ఎంత అందకత్తెయో ఆలోచించండి పంతులుగారూ!— అయితే మా నాయనగారు ఎప్పుడూ ఆమెను గౌనులోనే చూచి యున్నారట. గౌను లేనప్పుడు ఎంత సొగసుగా వుండేదో

ఊహించండి పంతులుగారూ ! అది కనుక్కోగలవారి అదృష్టము ఎంతటిదంటారు పంతులుగారూ !

ఒకానొక కమాను సందర్భంలో ఆమె "బాటసారుల బంగాళా" స్నానాల గదిలో స్నానంచేసి మెఱపులా మఱో గదిలోకి నడచి వెళ్లిందట.

దిస మొలమీద బొడ్డు అనే బొడ్డన బావి, దాని కెగువనే వళులనే ఎక్కు నిచ్చెన, వళులమీదనే వక్షోజ యుగళి అనే మిఱ్ఱుమిఱ్ఱునే కొఱ్ఱులు నా బొలుచు చూచుకాగ్రాలు, తక్కిన భాగాల కీలుకీలునా చెక్కు, టక్కు టిక్కు, తెల్లని మెడ, తిన్నని మూపు, నున్నని వీపు, అన్నువకౌను, బటువుం బట క్కులు, లటక్కన పట్టేసే డాన్సింగ్ నును పిక్కలు ఇన్నింటినీ కప్పి కాపాడే బంగారువన్నె శిరోజాలు, శిరోజాలి విసరున వీచే "ఉడ్ కొలోన్" షాంపూయింగు సువాసన, సువాసనమ్మతే ఎగిరి తన్ను తగిలేనా అనుపించు దేవతావస్త్రపు మేలిముసుగు ఆచ్ఛాదన—ఇవన్నీ డఫేదార్ను మైకంలో ముంచి పారేశాయట. ఒక్క త్రుటిలో వాడనుకొన్నాట్ట "ఆపాళంగా ఆమెను కౌగ లించుకొంటేనో" అని అనుకొన్న మఱుక్షణంలోనే వాడికి జ్వరంతగిలి శరీరం రగిలి, చలి మిగిలి, వణికి వళంతప్పి దొర గారిని సెలవడిగి వాడు తన యిల్లు చేరుకున్నాట్ట.

దొరసాని తన్నావేళ డఫేదారు చూచి మోహించి వున్నా డని తెలుసుకున్నదేగాని, వాడికి జ్వరం తగిలిందని సెలవుపెట్టి ఇంటికి చక్కా పోయాడని ఎఱుగదు.

"మఱి ఆ సెలవు సెలవు మెడికల్ లీవుగా పదిరోజులు పొడిగించినవాడు ఆ డఫేదారు. ఒకనాడు డఫేదారును గురించి

భర్తను కమానునుంచి తిరిగివచ్చాక అడగడంలో డఫేదారుకు జ్వరం తగిలిందని, కమాను వూరులోనే తగిలిందని విన్నది. ఎవరు? దొరసానమ్మగారు.

"విన్న తక్షణం ఆ జ్వరం ఎందుచేత వానికి వచ్చినదో భర్తకు తెలియజెప్పింది, తెలియజెప్ప తాను స్వయంగా వెళ్ళి రోగిని చూచివస్తానంది. దొరలున్నారే వారు మనవాళ్ళకుమల్లే భార్యల్ని అనుమానించరు; ఆజ్ఞాపించరు. వారి ఔదార్యం ప్రజలపట్ల ఎట్లా వుండగలదో, దారపుత్రాదులపట్ల కూడా అంతే! తానుకూడా "రానా!" అని అనలేదు,—"సరే వెళ్ళిరా!" అన్నాడు అంతే! ఆమె తిన్నగా కాంపు క్లర్కును, అంటే మా నాన్నగారిని తీసుకుని ఆ డఫేదారు ఇల్లు కనుక్కొని ఇంట్లో ఎవరున్నారని అడిగింది.

"ఒక ముసలి వృద్ధు ఎవరుతల్లీ! తమరు?" అని అడుగుతూ ఒక చిన్న గుడిసెలోంచి యివతలకు వచ్చాడు. మా నాయనగారు ఆమె కనుసంజ్ఞకే అంతదూరాన్ని చెట్టుక్రింద నిలిచిపోయినాడు. వింటున్నారా! పంతులుగారూ?

"నీవేనా యీ యింటిలోనుండేవాడవు?" అని అడిగింది దొరసానమ్మ.

"నేనూ, నా కొడుకూను. వాని కింకా పెళ్ళికాలేదు. జ్వరంవచ్చి పడిపోయినాడు. అదుగో ఆ నులక కుక్కిమీద" అని చూపించాడు. ఆమె నా వృద్ధుడు ఎవరో మందివ్వడానికో, మతం బోధించడానికో, లేక రెండూ గావించడానికో వచ్చిన మిషన్ మిస్సమ్మ అని ఊహించేడు. ఆమె డఫేదారు మంచం దరిసి "డఫేదార్" అని పిలిచింది. అతడు కళ్ళుతెరచి చూచాడు, "తల్లీ నమస్కారము" అన్నాడు.

ఆమె “ నీ జ్వరానికి కారణం నాకు తెలుసునులే—నీకు నన్ను కావులించుకోవాలనివుంటే కావులించుకో.— అయితే నీ జీతం ? ” అని అడిగింది. ముసలి వృద్ధుకు కొంత అర్థమై, కొంత అర్థంకాక “ తల్లీ! నెల కేడురూపాయ లన్నాడు. ఆ రోజుల్లో ఏడురూపాయలంటే నేటి డెబ్బై రూపాయలన్న మాట. ” మరి నా భర్తకు నెలకు రెండువేల రూపాయల జీతం. ఇతడికి ఏడురూపాయల జీతం. ఏడురూపాయలతో నాకు కావలసిన గౌనులు, షోకులు, షికారులు అన్నీ నెరవేర్చగలడా ? ఇతడు నన్ను మోహించి యీ జ్వరం తగలించుకున్నాడు అంది.

డఫేదార్ “ తల్లీ ! బుద్ధి గడ్డితింది. “ క్షమించండి ! ” అని అన్నాట్ట.

ఆమె క్షమించడానికి నీవు చేసిన తప్పేముంది కనుక: ఏది చేయి జ్వరం లేనట్టుందే? అని అభినయంతోపాటు అడిగిందట. “ తల్లీ! ఇప్పుడే తగ్గిపోయింది ” అన్నాట్ట డఫేదార్. కాంపు క్లర్కును పిలచి దొరసానమ్మ “ వీనికి రేపు పెళ్ళి కావాలి ” అని చెప్పిందట. కాంపు క్లర్కు “ చిత్తం ” అని మర్నాడు అతి వైభవంగా ఒక చక్కని చుక్కను ఆ డఫేదారుకు కట్టబెట్టినారట. నూతనదంపతుల్ని దొరసానమ్మగారూ, దొరగారూకూడా దీవించేరట.

“ ఏంచేసినా ఆ దొరలే చేయాలి. ఆ దొరసానులే చేయాలి. అయితే ఇప్పుడు వాళ్ళలోను నీతి, జాతి వమ్మయిపోయింది పంతులుగారూ! మనవాళ్ళూ నిర్వీర్యులై పోయారు పంతులుగారూ ! ” అని పెదవి విరిచాడు కథకుడు.